ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025 | 8 పేజీలు | ప్రకాశం | బాపట్ల

వీరయ్యచౌదరి హత్య కేసులో

పోలీసులకు స్పష్టత

- నిందితుల కోసం
- ముమ్మరంగా
- గాలింపు చర్యలు
- మోటారు సైకిల్‌పై
- తిరిగి కేసును
- ఛేదించిన
- ఎస్పీ దామోదర్
- నిందితులు
- ఉపయోగించిన
- రెండో బైక్ స్వాధీనం

వీరయ్యచౌదరి హత్య కేసులో దర్యాప్తులో భాగంగా బైక్‌పై వెళుతున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

టిడిపి నేత వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసులకు స్పష్టత వచ్చింది. ఎవరు చేశారు? ఎక్కడ నుంచి ఈ వ్యవహారం నడిచింది? ఎవరి పాత్ర ఉంది? ఎందుకు చేశారనే దానిపై పూర్తి అవగాహనకు వచ్చారు. నాలుగు రోజులుగా ఎస్పీ దామోదర్ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని విచారణ చేపట్టారు. స్వయంగా ఆయనే రంగంలోకి దిగారు. నిందితులు సంఘటనా స్థలం నుంచి ఎక్కడికి వెళ్లారు? ఎలా వెళ్లారు? ఏ వైపునకు వెళ్లారనే దానిపై నిఘా పెట్టారు. తొలి అరగంటలో చేయాల్సినదంతా చేశారు. యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముందుగానే వీరయ్యతో రాజకీయంగానూ, వ్యాపార లావాదేవీల్లో విభేదాలున్న వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఎవరి పాత్ర ఉంది? ఎవరి పాత్ర లేదనే విషయాన్ని గోప్యంగా ఉంచారు. చేయాల్సినదంతా గుట్టుగానే చేశారు. ఒక వైపు సిఎం పర్యటనకు చేయాల్సిన కర్తవ్యాన్ని నిర్వహించారు. మరో వైపు నేరస్తుల పరారీపై దృష్టి సారించారు. శుక్రవారం నాడు ఆయన ఉదయం నుంచి సాయంత్రం వరకూ మోటారు సైకిల్‌పైనే పర్యటించారు. నేరస్తులు వెళ్లిన మార్గాల్లో ▶ 2లో

'నల్ల'తాచు పడగ నీడలో వక్ఫ్ భూములు

- పాత శింగరాయకొండలో
- రూ.కోట్ల విలువైన భూమి స్వాధీనం
- చేసుకుంటున్న రియల్ వ్యాపారులు
- సర్వే నెంబర్లు మార్చి..రిజిస్ట్రేషన్లు.!
- కొనుగోలుదారుల్లో విఆర్ఒ,
- సబ్‌కలెక్టర్ స్థాయి అధికారి,
- జిల్లా స్థాయి రెవెన్యూ అధికారి..

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని వక్ఫ్ బోర్డు భూములు రియల్‌ఎస్టేట్ వ్యాపారి అయిన ఓ 'నల్ల'తాచు పడగ నీడలో ఉన్నాయి. ఈ రియల్ వ్యాపారి సర్వే నెంబర్లు మార్చి.. అమ్మకాలు చేపట్టారు. కొనుగోలుదారుల్లో రెవెన్యూ శాఖలోని గ్రామస్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఉండటం సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే రియల్‌ఎస్టేట్ వ్యాపారికి వెన్నుదన్నుగా నిలుస్తూ.. అక్రమంగా భూములు కొనుగోలు చేయడం గమనార్హం. ఈ వ్యవహారంపై అమరావతిలోని రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు అందడంతో సదరు అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించగా.. ఆ భూమిలో భవనం కూడా నిర్మించి ఉండటం చూసి.. ఆశ్చర్యానికి గురయ్యారు.

పాత శింగరాయకొండలోని వక్ఫ్ భూముల్లో అక్రమంగా నిర్మించిన భవనం

పాత శింగరాయకొండ సర్వేనెంబర్ 141లో నాలుగు ఎకరాల భూమి ఉంది. ఈ భూమి వక్ఫ్ బోర్డ్‌కి సంబంధించింది. ఈ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి ముందుగా కోటి రూపాయలతో ఓ ఇంటిని ఆ స్థలంలో నిర్మించారు. ఇక్కడ ఇంత పెద్ద ఇల్లు కట్టారని, ఇక్కడ ఎలాంటి ఇబ్బందులూ ఉండవని.. ప్రజల్ని నమ్మించి.. ఆ భూములను అమ్మకాలు చేపట్టారు. ఈ భూములు కొనుగోలు చేసిన వారిలో రెవెన్యూ శాఖలో కీలకమైన స్థానాల్లో ఉన్న అధికారులు ఉండటం గమనార్హం. కందుకూరుకు చెందిన ఓ విఆర్ఒను అడ్డు పెట్టుకొని ఆ వీఆర్వో ద్వారా ఇతర అధికారులకు తక్కువకి భూమి వస్తుందని నమ్మబలికి.. వాళ్ల దాచుకున్న డబ్బులతో ఈ భూములను కొనుగోలు చేయించాడు. సదరు అధికారులు వారివారి బినామీల పేర్లతో ఈ భూములు కొనుగోలు చేశారు. సదరు రియల్‌ఎస్టేట్ వ్యాపారి దొంగ సర్వే నెంబర్లు పెట్టి.. రిజిస్ట్రేషన్లు చేయించారు. వక్ఫ్ బోర్డు భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టడంతో కొందరు అమరావతిలో ఉన్నతస్థాయి అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో సదరు అధికారులు శుక్రవారం నాడు పాత శింగరాయకొండకు చేరుకొని వక్ఫ్ భూములను పరిశీలించారు. వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్ జుబేరు తహశీల్దార్ టి.రవిని కలిసి సమస్యను వివరించారు, వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ప్రసాద్, సర్వేయర్లు సాయి కుమార్, వీఆర్వోలు వెంకటాద్రి, సింహాద్రి, నంద కుమార్ ఆధ్వర్యంలో ఆ భూమిని పరిశీలించారు. వక్ఫ్ భూముల్లో పెద్ద భవనం ఉండటం చూసి.. ఈ ప్రభుత్వ భూముల్లో ఇలాంటి భవనాలు ఎలా నిర్మాణం చేశారని చుట్టుపక్కల వారిని విచారించారు. దొంగ సర్వే నెంబర్లతో లేఅవుట్‌ను నిర్మించి.. సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో నెంబర్లు మార్చి రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. అక్కడ ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతుండగా.. వెంటనే నిలుపుదల చేయాలని అధికారులు ఆదేశించారు. ఆ భూముల్లో నిర్మించిన భవనాన్ని కూడా తొలగించే ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.6 కోట్లు ఉంటుందని అంచనా. ఇలాంటి విలువైన భూములు ఆక్రమించి.. దొంగ సర్వే నెంబర్లతో అమ్మకాలు చేపడుతుండే ▶ 2లో

భూములు పరిశీలిస్తున్న అధికారులు

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మంత్రి అనగాని సత్యప్రసాద్

చెక్కు అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-నిజాంపట్నం, బాపట్ల జిల్లా

మత్స్యకారుల సంక్షేమ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం రేపల్లె నియోజకవర్గం, నిజాంపట్నం మండలం, కొత్తపాలెం ఫిష్ లాండింగ్ సెంటర్ వద్ద మత్స్యకారుల వేట నిషేధ భృతి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులు ప్రాణాల సైతం లెక్కచేయకుండా కష్టపడి జీవిస్తూ ఉంటారని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు మత్స్యకారుల వేట నిషేధవత్తిని రాష్ట్ర వ్యాప్తంగా శనివారం పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నారని అన్నారు. మత్స్యకారులకు అవసరమైన వలలు, బోట్లు, మోటార్ సైకిళ్ల వాహనాలను సబ్సిడీ కింద మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. సముద్రంలో చేపలు పొదుగు కాలంలో మత్స్యకారులకు పని లేని కారణంగా వారి జీవనోపాధి దెబ్బ తినకుండా నిషేధ కాలంలో ఏప్రిల్ 15 నుండి జూన్ 16వ తేదీ వరకు 61 రోజుల పాటు వేట నిషేధ కాలంగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని చెప్పారు. సముద్రంలో వేటకు వెళ్లకుండా మత్స్యకారులకు 61 రోజులకు కలిపి 20 వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని ఆయన తెలియజేశారు. ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నిజాంపట్నం ▶ 2లో

వీరయ్య చౌదరి హత్యకేసులో..

పోలీసులకు సృష్టత

(మొదటిపేజీ తరువాయి)

అన్వేషణ సాగించారు. సీసీ కెమెరాలున్న చోట్ల వాటిని కూడా పరిశీలించారు. ఎట్టకేలకు నిందితులు వినియోగించిన స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని వివరాలు సేకరించారు. వీరయ్యతో శత్రుత్వం ఉన్న వినోద్ వాహనంగా గుర్తించారు. అక్కడ నుంచి విచారణ మరింత వేగవంతం చేశారు. అదుపులో ఉన్న నిందితుల నుంచి కొంత సమాచారం సేకరించుకున్నారు. అన్నీ నిశితంగా పరిశీలించాక నేరం ఎలా జరిగిందనేది తేలింది. వీరయ్యతో మద్యం, రేషన్ బియ్యం, ఇసుక వ్యవహారాల్లో విభేదాలున్న వ్యక్తుల పాత్రే కీలకంగా ఉందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. సమాచారం పక్కాగా సేకరించారు. ఇప్పటి వరకూ 50 మందిని పైగా అనుమానితులుగా పిలిచి విచారించారు. కొందరి నుంచి ప్రాథమిక సమాచారం తీసుకున్నారు. కొందరిని ఇంకా అదుపులోనే ఉంచారు. ఇప్పుడు జరగాల్సింది హత్యలో పాల్గొన్న నేరస్తులను పట్టుకోవడం. వాళ్లు దొరికితే సూత్రధారులు ఎవరు? పాత్రధారులు ఎవరనే దానిపై స్పష్టత రానుంది. అప్పుడు కేసు కొలిక్కి వస్తుందని పోలీసులు భావిస్తున్నారు. ఎస్పీ విచారణ కోసం ఏర్పాటుచేసిన బృందాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తీసుకొని పరిశీలించారు. హత్యలో పాల్గొన్న నిందితులు దొరికితే వాళ్లు ఇచ్చే సమాచారం ఆధారంగానే క్రైమ్ ఎలా జరిగిందనే దానిపై మరింత స్పష్టతకు రానున్నారు. నిందితులు చీమకుర్తి వైపు వెళ్లి అక్కడ వాహనం పడేసి బస్సుల్లో వెళ్లిపోయారని గుర్తించారు. వీళ్లు ఎక్కడ తలదాచుకున్నారనే దానిపై గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా నిందితులు వినియోగించిన రెండో మోటారు సైకిల్ కూడా శనివారం నాడు పోలీసులకు లభ్యమైనట్లు తెలిసింది. ఆ మార్గంలోనే దీన్ని గుర్తించారు. ఇక ప్రస్తుతం వీరయ్యకు రాజకీయంగానూ, ఇతర విషయాల్లో శత్రుత్వం ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి, మరికొందరిని ఇంకా విచారిస్తూనే ఉన్నారు. కేసులో ఉన్నట్లు అనుమానితుడిగా ఉన్న ముప్పా సురేష్‌ను అదుపులోకి తీసుకోవాలి. ఎవరి పాత్ర ఎంతనేది హత్యలో పాల్గొన్న నిందితులు దొరికితే పూర్తిగా ఓ కొలిక్కి వస్తుందని పోలీసుల వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటివరకూ బయట ప్రాంతాల్లో భూమాఫియా పాత్రపైనా అనుమా నాలున్నాయి. వాటిని కూడా వదలకుండా విచారణలో భాగంగానే పెట్టారు. ఏదేమైనా కేసుపై ఓ స్పష్టతకు వచ్చారు. వీరయ్యతో రాజకీయంగా, వ్యాపారాల్లో పోటీతో విభేదాలున్న నేతల పాత్ర కీలకంగా ఉందని గుర్తించారు. ఎస్పీ దామోదర్‌కు సవాలుగా మారడంతో ఆయనే స్వయంగా రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. కేసును దాదాపుగా ఛేదించారు.

'కాటమరాజు' దేవస్థానానికి రహదారి నిర్మించాలి

- ఆలయ భూములు సర్వే చేయాలి
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆలయ కమిటీ వినతి

వినతి పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-మార్కాపురం

పెద్దారవీడు మండలం గుండంచెర్ల గ్రామ పంచాయతీ పరిధిలో నల్లమల అటవీ ప్రాంతంలోనున్న శ్రీవేనూతల కాటమరాజు గంగాభవానీ దేవస్థానానికి రాకపోకలు సాగించేందుకు భవిష్యత్‌లో రహదారి కోల్పోనున్నామని, ప్రత్యామ్నాయంగా రహదారులు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ కోరింది. ఈ మేరకు మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గుమ్మా గంగరాజు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నీరు నల్లమల సాగర్‌లోకి చేరినట్లయితే కాటమరాజు దేవస్థానానికి ఇప్పుడు రహదారులన్నీ నీటిలో ఉంటాయన్నారు. ప్రత్యామ్నాయంగా రహదారులను కమిటీ పరిశీలించినట్లు తెలిపారు. పెద్దారవీడు మండలంలోని బి.చెర్లోపల్లి గ్రామ సమీపంలోని శివాలయం నుంచి కలనూతల వరకూ రహదారి నిర్మించవచ్చన్నారు. అదే విధంగా పెద్దదోర్నాల మండలం చింతల అగ్రహారం నుంచి రహదారి కలనూతల వరకూ నిర్మిస్తే దేవస్థానానికి చేరుకోవచ్చన్నారు. ఆలయం వరకూ వెలిగొండ ప్రాజెక్టు ముంపులో ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన భూములను డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేయాలన్నారు. హద్దు రాళ్లను పాతేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, జి.చిన్న యల్లయ్య, జివి.సుబ్బారావు, పాముల పోలురాజు, పిన్నిక చక్రపాణి, గుమ్మా బాలనాగయ్య తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులను కాపాడుకుందాం : సిఐటియు

ప్రజాశక్తి - పొదిలి

మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడి సాధించుకున్న 8గంటల పనిదినం, హక్కులను కాపాడుకోవటానికి ప్రతి కార్మికుడు దీక్షపూనుతూ వాడవాడలా జెండా ఆవిష్కరణలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ పిలుపునిచ్చారు. వి.ప్రభుదాసు అధ్యక్షతన సిఐటియు మండల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ శతాబ్దాలుగా కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్‌ను తీసుకొస్తున్నాయన్నారు. 8 గంటల పని దినం స్థానే 12 నుంచి 15గంటలు పనిచేసేలా పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల దోపిడీ తీవ్రమవుతుందన్నారు. స్కీం వర్కర్స్‌కు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా వారి చేత వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు తెలిపారు. అసంఘటిత రంగం కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం రూపొందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. నూతన రవాణా చట్టం డ్రైవర్ల పాలిట ఉరితాడుగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో మే 1న కార్మికులు పని ప్రదేశాల్లో, నివాసప్రాంతాలలోను విస్తతంగా జెండా ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు పొదిలి మండల కార్యదర్శి బి.కోటేశ్వరావు, బిల్డింగ్ వర్కర్స్ వెంకట నరసయ్య, మినీ ట్రాలీ ఆటో నాయకుడు వెంకటేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సుబ్బయ్య, కోటేశ్వరి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు పద్మ, ట్రైలర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రమేష్

'నల్ల'తాచు పడగ నీడలో వక్ఫ్ భూములు

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది. వక్ఫ్ బోర్డు భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఆ రియల్ వ్యాపారికి ఈ జిల్లాలోని, నెల్లూరు జిల్లాలోని రెవెన్యూ శాఖలో పెద్ద తలకాయలు అండగా ఉన్నట్లు సమాచారం. ఆ అధికారులు ఇప్పటికే మండల స్థాయి అధికారులపై ఆ భూముల జోలికి వెళ్లొద్దని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇక్కడ పనిచేస్తున్న జిల్లాస్థాయి అధికారితో పాటు కందుకూరులో పనిచేస్తున్న విఆర్ఓ, నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న ఓ సబ్ కలెక్టర్ స్థాయి అధికారి ప్రమేయం కూడా ఈ భూముల విక్రయాల్లో ఉన్నట్లు తెలుస్తోంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వ్యక్తి వద్ద నుంచి దొంగ సర్వే నెంబర్లు వేసి ఆ భూమిని కొనుగోలు చేశారని సమాచారం. కలెక్టర్ సమగ్రమైన విచారణ చేపడితే.. కోట్ల విలువ చేసే వక్ఫ్ బోర్డు భూమిని కాపాడే అవకాశముంది.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

దుండి ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ప్రతినెల పెన్షన్లు 1వ తేదీన లబ్ధిదారుల ఇంటికెళ్లి ఉద్యోగులు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కొత్తపాలెం గ్రామంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం తీసుకుంటామన్నారు. కొత్తపాలెం గ్రామంలో జెట్టిను అభివద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్తపాలెం గ్రామంలో మత్స్యకారులకు వైద్యసహాయం అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తపాలెం గ్రామంలో మంద బయలు పోరంబోకు భూముల్లో గహాలు నిర్మించుకున్న వారికి త్వరలో నివేశనా స్థల పట్టాలు పంపిణీ చేస్తామని ఆయన సందర్భంగా చెప్పారు. కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ మత్స్యకారులు వేట నిషేధ కాలం భతిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మత్స్యకార వేట నిషేధకాల భతిని శ్రీకాకుళంజిల్లా ఎచ్చెర్ల నుండి ప్రారంభిస్తున్నారని చెప్పారు. సముద్రంలో మత్స్యకారుల వేట నిషేధ కాలం రెండు నెలలు ప్రభుత్వం ప్రకటించిందని ఆయన చెప్పారు. సముద్రంలో చేపలు గుడ్లు పొదుగు కాలంగా ప్రభుత్వం ప్రకటించిందని ఈ సందర్భంగా మత్స్యకారులు ఎవరు కూడా సముద్రంలో వేటకు వెళ్ళకూడదన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలకు రెండు నెలల కాలానికి 20వేల రూపాయలు వంతున ఇస్తుందని చెప్పారు. నిజాం పట్నంలో ఫిషింగ్ హార్బర్ అభివద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. నిజాంపట్నం మడ అడవుల ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్తపాలెం గ్రామంలో 300 ఎకరాల మంద బయలు పోరంబోకు భూములు ఉన్నాయని వాటిని పరిశీలించడానికి బందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొత్తపాలెం గ్రామంలో వ్యాన్ పిక్ ల్యాండ్ లేని భూములను 22 (ఏ) నుండి తొలగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లాకు చెందిన 12,671 మంది మత్స్యకారులకు రూ.25.34 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారుల కు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ ,జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి విలియమ్స్, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

బాపట్ల జిల్లా, అద్దంకి మండలం, కోటికలపూడి కాపురస్తుడు, శ్రీమన్నారాయణ గారి కుమారుడు నల్లూరి శ్రీనివాసరావు నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్షయింటు అయిన నల్లూరి శ్రీనివాసరావు గారు అద్దంకి నుండి మోటారుసైకిలు మీద కోటికలపూడి గ్రామం వెళ్ళుచుండగా అతనికి సంబందించిన భూమి తాలుకు దస్తావేజులు పోయినవి. సదరు దస్తావేజులు నెంబరు 2351/2007 దగ్గి, SRO. సదరు దస్తావేజులు ఎవ్వరికైనా దొరికినయడల సదరు నల్లూరి శ్రీనివాసరావు గారుకు గానీ, అడ్వకేట్ ఆఫీస్‌లోగానీ,అందజేయవలసినదిగా కోరుచున్నాము. సదరు దస్తావేజులు ఎవ్వరికైనా దొరికినచో, వారు సదరు దస్తావేజులుతో ఎలాంటి లావాదేవీలు జరిపినను అట్టి లావాదేవీలు మాక్షయింటు పై బద్దపరసజాలవని యావన్మందికి తెలియజేయడ మైనది. మరియు మాక్షయింటు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు భాద్యులగుదురు.

అద్దంకి
తేది: 26-04-202 ఇట్లు
శ్రీ తేలప్రోలు క్రిష్ణయ్య
అడ్వకేట్, అద్దంకి

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 614/2023
పందరబోయిన గంగయ్య .. వాది
వర్సస్
వై.ఎస్.శ్రీనివాసులు .. ప్రతివాది
To,
ప్రతివాది చిరునామా
వై.ఎస్.శ్రీనివాసులు తండ్రి రోశయ్య,
48 సం.లు, హిందూ, వ్యాపారం,
డోర్ నెం 5-11, అంబవరం గ్రామం,
గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీనుండి దావా పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ:29-04-2025న వాయిదా పుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీవకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచోమీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు
తేదీ : 26-04-2025
ఇట్లు
శ్రీ భూపని వెంకటేశ్వర రావు,
వాది తరుపు న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ నెం : 607/2024
ఇన్
ఓ.యస్ నెం : 129/2019
మరియు
ఓ.యస్ నెం : 129/2019
బత్తిని రమాదేవి ..పిటిషనర్ /వాది
వర్సస్
రేగలగడ్డ ఆవులయ్య చనిపోతే
ఆయన వారసులు 2 టు 4 రెస్పాండెంట్లు
..రెస్పాండెంట్స్ / ప్రతివాదులు
టు,
R3 రెస్పాండెంట్ /ప్రతివాది చిరునామా
రేగలగడ్డ తిరుపతి తండ్రి ఆవులయ్య,
ఆర్మీ ఉద్యోగం, హిందూ, వయస్సు 34
సంవత్సరాలు, సోమిదేవిపల్లి గ్రామం,
రాచర్ల మండలం,ప్రకాశం జిల్లా.

పైనెంబర్ దావా/పిటిషన్‌లోని ప్రతివాదులు/రిస్పాండెంట్స్ పైపరిహారం రాగోరి మీపై దావా/పిటిషన్ దాఖలు చేసినందున, సదరు దావా/పిటిషన్‌లో నీవు పైకోర్టులో హాజరైనీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 02-05-2025వ తేదీన యున్నది. నీవు వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు నీవు స్వయంగా గాని లేదా నీ పకీలు గారి ద్వారా గాని నీవు పైకోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిో నీపరోక్షమందు దావా/పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు
వాయిదా తేదీ : 02-05-2025 ఇట్లు
శ్రీ డి.సిద్దయ్య,
అడ్వకేట్, గిద్దలూరు,
ప్రకాశం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
సెల్ నెం : 8897214930

ప్రజాశక్తి
ఆదివారం 27 ఏప్రిల్ 2025

ఉగ్ర దాడిని నిరసిస్తూ సిపిఎం ర్యాలీ

ప్రజాశక్తి-కనిగిరి

జమ్ము కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కనిగిరిలో శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థలను దేశం నుంచి తరిమికొట్టాలని కోరారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేయడం సరికాదని అన్నారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో

ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న కేశవరావు

సిపిఎం నాయకులు ఎస్ కే బషీర, ప్రసన్న, శాంత కుమారి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

శింగరాయకొండ: జమ్ము కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మౌనం పాటించి క్యాండిల్ వెలిగించి మృతులకు నివాళులర్పించారు. శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఉగ్రవాదులు ఎక్కడున్నా వారిని కఠినంగా శిక్షించాలని, శాంతియుతభావంతో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్న మన దేశంలో ఇలాంటి ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బచ్చు కోటేశ్వరరావు, ఎస్‌డి సర్దార్ తదితరులు తెలిపారు.

పర్యాటకులపై దాడి హేయమైన చర్య

కొండపి: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడి అత్యంత హేయమైన చర్య అని ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. ఉగ్ర దాడిలో మరణించిన పర్యాటకులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సంతాపం ప్రకటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించామని అన్నారు. మరణించిన కుటుంబాల సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శింగరాయకొండలో నిరసన తెలియజేస్తున్న దశ్యం

కొండపిలో మౌనం పాటిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

మృతి చెందిన శ్రీహరి చౌదరి

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని దొడ్డవరప్పాడు గ్రామ సమీపంలో గుంటూరు వైపు వెళ్లే నేషనల్ హైవేపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అద్దంకి మండలం నాగులపాడు గ్రామానికి చెందిన మందపల్లి శ్రీహరి చౌదరి (25) ఒంగోలు నుంచి మేదరమెట్ల వైపుకు వస్తుండగా దొడ్డవరప్పాడు గ్రామ సమీపంలోకి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

ప్రజాశక్తి-మద్దిపాడు

ద్విచక్ర వాహనం చోరీపై స్థానిక స్టేషన్లో శనివారం కేసు నమోదు అయింది. మండల కేంద్రమైన మద్దిపాడులోని ఇస్లాం పేటకు చెందిన షేక్ రియాజ్ శుక్రవారం తన ద్విచక్ర వాహనం బుల్లెట్ బండిని ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రోడ్డు ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక హిమగిరి గిరిజన కాలనీ నుంచి చీమకుర్తికి వచ్చే రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించుకోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు స్థానిక మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మిలకు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. శనివారం కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీకి వచ్చే మార్గంలో రోడ్డు చిరువైపులా ఆక్రమించుకోవడంతో పాటు విద్యుత్ శాఖ వారు స్తంభాలను రోడ్డు మధ్యలో వేశారని రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగించి తమ కాలనీకి వచ్చే రోడ్డు క్రమబద్ధీకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎం.అంజిబాబు, వై.రాయుడు, పి.ప్రసాదు, ఏం.విజయలక్ష్మి, పొట్లూరి వెంకట్రావు, అల్లూరయ్య, వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందిమల్ల గంగాధర్ రావు, టిడిపి నాయకులు సూరంపల్లి హనుమంతరావు, గోగినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శివ సదన్‌లో ఆదర్శ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ ఫేజ్ కూటింగ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు కె. శాంతి మాట్లాడుతూ చెంచు గిరిజనులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకాలకు కావాల్సిన ముఖ్య పత్రాలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఉపాధి హామీ జాబ్‌కార్డు లాంటివి సిద్ధం చేసుకొని ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రైస్ కార్డుకు ఈకేవైసీ జరుగుతుందని, కనుక ప్రతి గిరిజనుడు తమ రైస్ కార్డులకు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మనమిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. వాటి ద్వారా ప్రజలు కార్యాలయాలకు వెళ్లకుండా వారి మొబైల్‌లోనే వాట్సాప్ ద్వారా నేరుగా సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అడిపి కరుణాకర్, ఐటిడిఎ ప్రతినిధి డి.మంతన్న, విఆర్ఒలు వెంకటయ్య, ప్రసాదు, సామేలు, కోటేశ్వరరావు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బాలికా వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు సిడిపిఒ బి. జ్యోతి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కారాయలంలో కార్యాలయంలో ఎన్ఎంలు ,ఆశా వర్కర్లు, వివిఒలు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలబాలికల కిషోర వికాసం కార్యక్రమ నిర్వహణపై శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ జ్యోతి మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల బాలబాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేయాలన్నారు. మంగళ, శుక్రవారాల్లో మీటింగ్స్ ఏర్పాటు చేసి పోషణ, కౌమార బాలికల సమస్యలు, సంరక్షణ, ఆరోగ్యం, సాధికారత స్వశక్తి, సమర్థవంతమైన జీవితం, సంపన్న జ్ఞానం పెంపొందించడానికి అవసమైన విషయాల గురించి పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బారెడ్డి, ఎంఇఒ కావడి వెంకటేశ్వర్లు,ఎపిఎం కె. నరేష్.హెల్త్ సూపర్ వైజర్లు,మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

జార్జి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక జార్జి ఫార్మసీ కళాశాలలో ఓమెగా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తు, అభివృద్ధి దష్ట్యా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. విద్యార్థుల ఎంపిక కోసం లిఖిత పూర్వక పరీక్షలు, వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఓమెగా హెల్త్‌కేర్ సంస్థ హెచ్ఆర్ మనోజ్ కుమార్ సజావుగా నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 40 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యా ర్థులకు సంస్థ ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.జయరావు, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ భూములపై స్పష్టత ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం నల్లగండ్ల పంచాయతీ పరిధిలోని చిన్న గొల్లపల్లి చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన వందలాది ఎకరాలు భూములు వంశపారంపర్య వ్యక్తులకు చెందుతుందా లేక దేవాదాయ శాఖ పరిధిలో ప్రభుత్వానికి చెందుతుందా అనేది నిర్ధారణ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆలయ పరిధిలో పోతురాజులు, కన్నమ నీడులు, నాయి బ్రాహ్మణ, రజక అనేక సామాజిక తరగతులు సంవత్సరాల తరబడి చాకిరీ చేస్తున్నారని, వీరి సేవకు నేటికీ ఎలాంటి ప్రతిఫలం లేదన్నారు. చాకిరి మాన్యాలు ఉంటే వాటి వాస్తవ పరిస్థితులు సంబంధిత వర్గాలకు తెలియపరచాలని లేకపోతే అక్కడ సేవ చేస్తున్న వారికి ఉపాధి కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం దేవాదాయ శాఖ వారు ఆలయ ఆస్తులు మొత్తం ప్రభుత్వ పరిధిలో ఉందని, చిన్న గొల్లపల్లి నల్లగండ్ల పెద్ద గొల్లపల్లి దొడ్డి చింతల తదితర గ్రామాలలో 127 ఎకరాల 64 సెంట్లు భూమి అన్యాక్రాంతమైనట్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. గత సంవత్సరం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ పోరేటి శ్రీనివాసరెడ్డి ఈ సమస్యపై విచారణ చేశారని తెలిపారు. గత సంవత్సరం తిరునాళ్ల దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే నిర్వహించిందన్నారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ ఈవో మరియు రెండు వేరు వేరు ప్రచార కరపత్రాలు విడుదల చేశారన్నారు. తిరునాళ్ల కార్యక్రమం ఎవరు చేస్తున్నారు? అనేది స్పష్టత లేకుండా ప్రజలను అయోమయంకి గురి చేస్తున్నారని తెలిపారు. జిల్లా పరిధిలో అనేక గ్రామాల నుంచి వందలాదిమంది ఇక్కడ జరిగే కార్యక్రమాలు పాల్గొనటానికి ప్రజలు వస్తుంటారని వీరికి కనీస సౌకర్యాలు కూడా ఉండటం లేదని, ప్రభుత్వ అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని ఒక స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

యోగాతో ఒత్తిడి దూరం : సిఐ

ప్రజాశక్తి-కొండపి

యోగాసనాలు చేస్తున్న సీఐ సోమశేఖర్, పోలీస్ సిబ్బంది

యోగా శరీరక సామర్థ్యాన్ని పెంచుతుందని సీఐ సోమశేఖర్ అన్నారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి యోగ కార్యక్రమాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్య రక్షణకు ఒత్తిడి నివారణకు యోగ చాలా ఉపయోగపడుతుందన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని కచ్చితంగా రోజు వ్యాయామం చేయాలని సూచించారు. కేసుల పరిశోధనలో సాంకేతికను ఉపయోగించుకోవాలని, స్టేషన్‌కి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆయా మండలాల్లో సిబ్బందికి కేటాయించిన గ్రామాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని సిబ్బంది ఆయా స్టేషన్ల ఎస్సైలకు తెలియపరచాలన్నారు. రౌడీ షీటర్లను, సస్పెక్ట్ షీట్లు కలిగిన వ్యక్తులను గమనిస్తూ వారిపైనేగా ఉంచాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రేమ్ కుమార్, అనూక్, ఏఎస్ఐ అంకారావు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఏయు శతవసంత వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్లలో 1913లో జరిగిన ప్రథమాంధ్ర మహాసభలో ఆంధ్ర రాష్ట్రంతో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం కోసం నాటి నాయకులు డిమాండ్ మేరకు 13ఏళ్ళ అనంతరం 1926 ఏప్రిల్ 26న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవిర్భవించిందని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు అబ్దుల్ కలాం అన్నారు. విశ్వ విద్యాలయం శత వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా శనివారం ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని టౌన్ హాలులో గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఫోరం కార్యదర్శి పిసి సాయి బాబు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రానికి, తెలుగు పద్యానికి, తెలుగు లిపికి, తెలుగు తల్లికి, తెలుగు విశ్వవిద్యాల యానికి పుట్టినిల్లుగా బాపట్ల భాసిల్లుతుందని అన్నారు. అధ్యాపకులు వసంత, నైమిశ, నాగ మల్లేశ్వరి, వెంకట లక్ష్మమ్మ, చైతన్య, ఎం నరసింహా రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలన్న రాధా మాధవి

రికార్డుల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి - కొల్లూరు

అంగన్‌వాడీ కేంద్రాల రికార్డుల నిర్వహణపై కార్యకర్తలు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి రాధా మాధవి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అమృతలూరు సెక్టార్ పరిధిలోని అంగనవాడి కార్యకర్తల సమావేశం సిడిపిఒ గన్నవరపు విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు కచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ ఓ విజయరాణి, సూపర్వైజర్లు విజయలక్ష్మి, పజరున్నాస, అమృత వాణి, మాధవి వెంకటరమణ, నగరాజకుమారి, శాంతి, శకుంతల, సునీత, సంపూర్ణ, మాణిక్యం లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థిని షబానాను అభినందిస్తున్న ఎంఈఒ

కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

కష్టమైనా ఇష్టపడి చదివితే మంచి ఫలితం తప్పనిసరిగా సాధిస్తారని ఎంఇఒలు అజయ్‌కుమార్, శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎంఆర్‌సి ఆవరణలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. స్థానిక ఆదర్శ హైస్కూలు విద్యార్థి షేక్ షబానా 593మార్కులతో మండల ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమని, పాఠశాల కరస్పాం డెంట్ తోటకూర విజయభాస్కర్‌ను శాలువాతో సత్కరిం చారు. మండలంలో మంచి ర్యాంక్‌తో పాటు నూరు శాతం ఫలితాలు సాధించటం శుభపరిణామమని అభినందిం చారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. దీవి రమేష్ కుమార్, గోరంట్ల శ్రీనివాసరావు, భవనం కేశవరెడ్డి, సునీల్, రవి, సిఆర్‌పిలు, ఆపరేటర్ బాషా పాల్గొన్నారు.

28న నల్లబర్లీ పొగాకు రైతుల సదస్సు

• జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ • గ్రామాల్లో రైతుల సమావేశాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈ నెల 28న నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఇంకొల్లులో నిర్వహిస్తున్న సదస్సు జయప్రదం చేయాలని చిన్నగంజాం, ఇంకొల్లు మండలాల్లోని గ్రామాల్లో రైతు సంఘం నాయకులు శనివారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఇంకొల్లు మండలం భీమవరంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామ కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తెలపనేని రామారావు రైతులు, కౌలు రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. చిన్నగంజాం మండలం సంతరావూరులో చెరువు కట్టపై రైతులు, కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు, కౌలు రైతులు మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు సాగు చేసిన తమ పరిస్థితి దారుణంగా ఉందని వాపోయారు. సాగు చేయమని ప్రోత్సహించిన కంపెనీలు కొనుగోలు చేయటానికి తమ గ్రామాల వైపే రావటం లేదని అన్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకు కొట్టిన కూలీలకు కూలీ డబ్బులు పూర్తిగా ఇవ్వలేక, వారికి సమాధానం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు నాయకులు

చెప్పలేక ముఖం చాటేసే పరిస్థితి వచ్చిందని అన్నారు. కుటుంబ జీవనం నడవటం గగనంగా మారిందని అన్నారు. రైతులకు రైతు సంఘం అండగా ఉంటుందని, పేరుకు పోయిన పొగాకు నివ్వలు కొనే వరకు ప్రభుత్వంతోపాటు కంపెనీలతో పోరాటం చేస్తామని రైతు సంఘం నాయకులు తెలిపారు. పొగాకు సమస్య తీరాలంటే రైతులు ముందుకు వచ్చి పోరాటాల్లో పాల్గొనాలని అన్నారు. 28న ఇంకొల్లులో జరిగే నల్లబర్లీ పొగాకు రైతు సదస్సు జయప్రదం చేయాలని కోరారు. ఆ సదస్సుకు రైతు సంఘం నాయకులు హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వానికి సమస్య విన్నవిస్తారని తెలిపారు.

ఉగ్రదాడిపై యుటిఎఫ్ నిరసన ర్యాలీ

బాపట్లలో యుటిఎఫ్ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

కాశ్మీర్‌లో పర్యాటకులపై ఆటవికంగా దాడులు జరిపి 26 మంది మృతి చెందటానికి కారణమైన పాకిస్తాన్ ఉగ్రవాదుల చర్యను నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ శనివారం నిర్వహించారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత దేశం లౌకిక దేశమని, భిన్నత్వంలో ఏకత్వంగా ప్రతి ఒక్కరు మత సామరస్యం కలిగి ఐకమత్యంతో ఉన్న దేశంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల చర్యను ఖండిస్తున్నామని అన్నారు. ఈ దారుణ మారణకాండకు పాల్పడిన ఉగ్రవాదులను సమూలంగా రూపు మాపాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, నాగార్జున, ఆచారి, రాజేష్, బివి శ్రీనివాస్, రవికాంత్, కృష్ణంరాజు, కొండా నాగరాజు పాల్గొన్నారు.

బట్టిప్రోలు : ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన పర్యాటకులకు సంతాపంగా కొవ్వత్తులతో సిపిఎం నివాళులు అర్పించారు. దాడిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, ఉగ్రవాదాడిని రూపుమాపాలి సిపిఎం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, మండల కార్యదర్శి జి సుధాకర్ మాట్లాడారు. దాడిని యావత్ మానవ సమాజం ఖండించాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, కొలిమర్ల రామస్వామి, పి మనోజ్ కుమార్, అహరోను, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

చీరాల : ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బండి బిక్షాలు బాబు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి సురేష్, సీనియర్ నాయకులు గవిని నాగేశ్వరరావు, కె వీరాంజనేయులు, ఆర్ ఆంజనేయులు, ఎన్ రాజేష్, సిహెచ్ వెలుగొండరెడ్డి, ఎం శ్రీనివాసులు, నాగమల్లేశ్వరరావు, శ్రీమాన్, పింజల శ్రీనివాసరావు, కె మాల్యాద్రి, శ్రీరామ్ శ్రీనివాసరావు, చంద్రారెడ్డి, ప్రభాకర్, శ్రీనివాసరావు, జగదీష్, బ్రహ్మం, ఏసోబు పాల్గొన్నారు.

పంగులూరు : కాశ్మీర్లో ఉగ్రదాడికి వ్యతిరేకంగా శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. బీసి సంఘ అధ్యక్షులు చేబ్రోలు రవిచంద్ర చారి, ఎన్ రత్తయ్య చౌదరి, కందుకూరి మల్లికార్జునరావు, నందవరపు పీర్ సాహెబ్, ఆంజనేయులు, కరిముల్లా, సుబ్బయ్య పాల్గొన్నారు

భట్టిప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

చీరాలలో నివాళులు అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సముద్ర తాబేళ్లను రక్షించుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పొట్టి సుబ్బయ్య పాలెం సముద్ర తీరంలో ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్తు ద్వార ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుండి 77 చిన్న తాబేళ్ల పిల్లలను ఎపిఎస్ ఐడిసి విశ్రాంత అసిస్టెంట్ ఇంజనీర్ ఎంవై సత్యాన్నారాయణ చేతుల మీదుగా సముద్రం లోకి శనివారం వదిలారు. జీవ వైవిధ్యం పరిరక్షణలో సముద్ర తాబేళ్లు సంరక్షణ ప్రధానమని అన్నారు. కార్యక్రమంలో శవసం చంద్రా రెడ్డి మాట్లాడుతూ పొట్టి సుబ్బయ్య పాలెం సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రంలో సముద్రంలోనికి వదిలార ని తెలిపారు. చీరాల క్రాంతి, వెంకటేశ్వర్లు, జిఎం జిందాల్ కంపెనీ, సముద్ర రక్షణ దళ సభ్యులు జయరాం, వెంకటేష్ పాల్గొన్నారు.

తాబేలు పిల్లలను వదులుతున్న దృశ్యం

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి యూనిట్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక గీతా మందిరం ప్రాంగణంలో నిర్వహించారు. సమావేశానికి షేక్ మస్తాన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సంఘం కార్యదర్శి టి కృష్ణయ్య నివేదిక సమర్పించారు. జమా ఖర్చుల లెక్కలు కోశాధికారి మారం కోటేశ్వరరావు వివరించారు. భవన నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన దాతలకు అసోసియేట్ అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి ధన్యవాదాలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని రావుల బాపయ్య చౌదరి సూచించారు. జిల్లా కార్యదర్శి కరి కమలేశ్వరరావు, మార్టూరు అధ్యక్షులు రామారావు, తేలుకుట్ల మురళీధరరావు, సిహెచ్ అంజలీదేవి, బి అంజయ్య, కె సత్యనారాయణ, షేక్ గంజి సైదా తదితరులు మాట్లాడారు. నూతన కార్యవర్గ ఎన్నికకు యర్రగుంట క్రిష్ణమూర్తి ఎన్నికల అధికారిగా, యువి గోపాలరావు సహాయ ఎన్నికల అధికారిగా, తగిరిశ వీరాంజనేయులు పరిశీలకులుగా వ్యవహరించారు.

అధ్యక్షులు అడుసుమల్లి అనంత కోటేశ్వర రావు, కార్యదర్శిగా నిమ్మరాజు నాగేశ్వరరావు, కోశాధికారిగా వారణాసి రఘురామశర్మ, అసోసియేట్ అధ్యక్షులు నర్రా గోపాలరావు, పల్లపు ఆంజనేయులు, గౌరవాధ్యక్షులుగా కె దేవసహాయం, ఉపాధ్యక్షులుగా ఎ ప్రభాకరరావు, పొన్నపల్లి బ్రహ్మానందం, పల్నాటి జయరాణి, ఆకుల చిన్నయోగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి మక్కెన వెంకటేశ్వర్లు, సహాయక కార్యదర్శులు పెండ్యాల అంకయ్య, ఆవుల చిన రామచంద్రారెడ్డి, చేకూరి మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో సందిరెడ్డి వెంకటేశ్వర్లు, డాక్టర్ యు దేవపాలన, చెన్నుపాటి రామాంజనేయులు, జ్యోతి చంద్రమౌళి, మోపర్తి వెంకట్రావు, తాతయ్య, టి శేణుగోపాలరావు, అచ్చారావు, పాటిబండ్ల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

తనిఖీ చేసిన బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

కుట్టు శిక్షణ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం వెంకటేశ్వరరావు సూచించారు. చెరుకుపల్లి 2వ సచివాలయం వద్ద నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. హాజరైన అభ్యర్థులు, హాజరు పట్టికను ఆన్‌లైన్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈవూరి విజయబాబు, శిక్షకురాలు నాగమణి, కేంద్రం నిర్వాహకులు భార్గవి పాల్గొన్నారు.

28 నుండి వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక గ్రంథాలయ నందు ఈనెల 28 నుండి జూన్ 6 వరకు విద్యార్థినీ, విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు బాదం విజయ భాస్కరరెడ్డి తెలిపారు. విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు వివిధ రకాల విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

పండ్ల తోటలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖ సంయుక్తంగా పండ్ల తోటలు పెంపకం పథకం అమలు చేస్తున్నట్లు ఎపిఒ ఎం బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి అర్హత, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

'అంబేద్కర్' నాటక కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాజ్యాంగ నిర్మాత భారత రత్న 'డాక్టర్ బిఆర్ అంబేద్కర్' జీవిత చరితను నాటక రూపంలో ప్రదర్శించడం అభినందనీయమని ప్రకాశం జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు పేర్కొన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో 'సామాజిక చైతన్య ఉత్సవాలు' పేరుతో హైదరాబాద్‌కు చెందిన అకాడమీ వారిచే 'సంఘం శరణం గచ్చామి' (అంబేద్కర్ జీవిత చరిత్ర) మే 8న ఒంగోలు, మే 9న మద్దిపాడులో ప్రదర్శిస్తున్న సందర్భంగా నాటక కరపత్రాలను శనివారం సాయంత్రం డిఆర్ఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న ఆర్థిక, సామాజిక అసమానతలు రూపుమాపేందుకు అంబేద్కర్ అవిశ్రాంత పోరాటం చేశారని గుర్తుచేశారు. నాడు సమాజంలో వేళ్లూనుకున్న అంటరానితనానికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిమ్న జాతులకు విద్య, వైద్యం, అందుబాటులోకి తేవడంలో ఆయన కృషి చేశారన్నారు. ఆయన రూపొందించిన రిజర్వేషన్ ప్రక్రియ ద్వారా ఉన్నత విద్య, చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కిందన్నారు. అటువంటి మహనీయుని చరిత్రను ప్రతిఒక్కరూ ఈ ప్రదర్శన ద్వారా వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ఉద్యోగులు, అధికారులు, ప్రజాసంఘాలు ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని సూచించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడుతూ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలలో భాగంగా ఏప్రిల్ 22న కర్నూలు జిల్లా నుండి రాష్ట్రమంతా నెల రోజుల పాటు ప్రదర్శనలు ఇస్తూ రాష్ట్ర కేంద్రం విజయవాడలో ముగుస్తుందని తెలిపారు. 'బుద్ధం శరణం గచ్చామి' అన్న సత్యాన్ని ప్రజా ముంగిట ఉంచేందుకు చేస్తున్న ప్రయత్నానికి ఆర్థికంగా, హార్థికంగా సహకరించాలని కుటుంబ సమేతంగా హాజరై నాటకాన్ని చూసి సామాజిక ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, జేసురత్నం, జిల్లా కమిటీ సభ్యులు సంజీవరావు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డిఆర్ఓ చినఓబులేసు

మూగజీవాల దాహార్తిని తీర్చండి

- స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి
- నీటి తొట్టెలు, ఉట్టిలను ప్రారంభించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా

నీటి తొట్టెలు, ఉట్టిలను ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు, పక్షుల కోసం ఏర్పాటు చేసిన నీళ్ల ఉట్టిలను శనివారం ఆమె ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో నీటి తొట్టెలు, ఉట్టిలను ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మూగజీవాల దాహాన్ని కూడా తీర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ దిశగా స్వచ్ఛంద సంస్థలు మరింతగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ తొట్టెలు, ఉట్టిలలో నీళ్లు తగ్గితే గమనించిన వెంటనే స్థానిక ప్రజలు వీటిని నింపే ప్రయత్నం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవిలో దాహం వల్ల కుక్కలు చాలా క్రూరంగా మారి.. మనుషులపై దాడి చేస్తాయని, వాటి క్రూరత్వం తగ్గించటానికి నగరంలో 50 నీటి తొట్టెలు ఏర్పాటు చేశామని, అలాగే 200 ఉట్టిలలో మట్టి మూకుడులు కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వీటి ఏర్పాటు కోసం సహకరించిన పశుసంరక్షణ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్‌పి అశోక్‌బాబు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్త, సూర్యశ్రీ వికలాంగుల చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ మండవ మురళీకృష్ణ, 'సేవ్ ది యానిమల్' ఫౌండేషన్ ప్రతినిధులు దివ్య, శ్రీదేవి, 'పీపుల్ ఫర్ యానిమల్' ఫౌండేషన్ ప్రతినిధి సికిందర్, ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, ఇతర అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష టన్నుల ఇసుక నిల్వలు ఉంచాలి

గనులు, భూగర్భజల శాఖ డిడికి కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ఇసుక డిపోలలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా గనులు, భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్‌ను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లా గనుల శాఖ అధికారులు, జిల్లాలోని 6 ఇసుక స్టాక్ యార్డు దారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలు, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఇసుక అక్రమ రవాణా, దుర్వినియోగం, బ్లాక్ మార్కెట్ విక్రయదారులపై సంబంధిత తహశీల్దార్ల ద్వారా హెచ్చరించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇసుక స్టాక్ యార్డు దారులు జిల్లాలో మరిన్ని ఇసుక నిల్వ డిపోలకు అనుమతులను, వాగులు వంకల నుంచి ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతాలకు ఇసుక రవాణాను మరింత కట్టడి చేయాలన్నారు. ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలను తీసుకుంటామని, అవసరమైతే పోలీసు శాఖ ద్వారా కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి టి.రాజశేఖర్, స్టాక్ యార్డుదారులు పాల్గొన్నారు.

డిడితో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

పన్ను చెల్లింపులకు నేడు ప్రత్యేక కౌంటర్లు

కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి కుళాయి పన్నులు చెల్లించటానికి ఆదివారం కూడా నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలపై పెనాల్టీపై 50 శాతం రాయితీ, ప్రస్తుత సంవత్సరం ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీకి ఈ నెల 30 వరకు మాత్రమే అవకాశం ఉన్నందున పన్ను చెల్లింపు దారులందరూ ఆదివారం రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా పన్నులు చెల్లించాలని కోరారు.

ఉగ్రవాదులను అంతమొందించాలి

ఒంగోలులో కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో నరమేధం సృష్టించిన ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం అంతమొందించాలని ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ శుక్రవారం ఒంగోలులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాంగనగర్ 1వ లైన్ వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద నుండి చర్చి సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కొక్కిరాల సంజీవ కుమార్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిలో 28 మంది మృతి చెందారని, ఇటువంటి ఘటన అమానుషమన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, మరలా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షులు నరహరి సాంబయ్య, ఉమ్మిడిశెట్టి శ్రీనివాసరావు, కాపు ఏంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు నారపుశెట్టి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నేతలు

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రంగస్థల కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూమ్ ఆవరణలో శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అండ్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ నటులు మిడసల మల్లికార్జునరావు అభినందన సభ నిర్వహించారు. కనమాల రాఘవులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లూరి మాట్లాడుతూ అంతరించిపోతున్న రంగస్థల ప్రాధాన్యత గుర్తించి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. ప్రముఖ నటులు డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులు మాట్లాడుతూ పౌరాణిక నాటకాలను ప్రజలు మెచ్చే విధంగా చేయడం, చేయించడంలో మిడసల అభినందనీయుడని కొనియాడారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, జాతీయ అధ్యక్షులు కళామిత్రమండలి (తెలుగు లోగిలి) డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు, అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి నిర్వాహకులు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో సివియన్ రీడింగ్ రూమ్ క్లబ్ అధ్యక్షులు ఈదుపల్లి గుర్నాథం, కార్యదర్శి కె.రాధాకృష్ణ, కోశాధికారి ఆరిగ వీరప్రతాప్, సింహాద్రి జ్యోతిర్మయి, యు.వి. రత్నం, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, ముస లయ్య, బాలకోటయ్య ఆయనను సత్కరించారు. తొలుత చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి.

మల్లికార్జునరావును సన్మానిస్తున్న దృశ్యం

మత్స్యకార భృతిని పెంచిన ప్రభుత్వం

- 5,501 మందికి రూ.11.20 కోట్ల లబ్ధి
- మత్స్యకారులకు చెక్కు అందజేసిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతి ఏటా 2 నెలల పాటు ఉండే చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాల జీవనం కోసం ఇచ్చే భతిని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మత్స్యశాఖ ఏర్పాటు చేసిన సముద్ర చేపల వేట నిషేధ కాలంలో భృతి పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మెగా చెక్కును మత్స్యకారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రకాశం జిల్లాలో 2025-26 సంవత్సరానికి గాను 5,501 మంది సముద్ర మత్స్యకారులకు ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు చొప్పు మొత్తం 11.20 కోట్ల లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. జిల్లాలో కొత్తపట్నం, ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండ, నాగులుప్పలపాడు మండలాలకు చెందిన 5,501 మంది మత్స్యకారులకు ఈ భతిని అందచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా శ్రీకాకుళం జిల్లాలో ఈ భతిని మత్స్యకారులకు అందచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు పేరయ్య, మత్స్యకార సంఘాల ప్రతినిధులు తిరుపతిరావు, సున్నం తిరుపతి, రాయం శ్రీనివాసరావు, వివిధ మత్స్య కార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తహశీల్దారిగా మేక శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గత నెల రోజుల క్రితం వివిధ కారణాలతో బాధ్యతల నుండి తప్పుకోవడంతో వేమూరు తాసిల్దార్ సుశీల ఇన్చార్జి బాధ్యతలు చేపట్టారు. అనంతరం తిరిగి శ్రీనివాసరావు శుక్రవారం నుండి బాధ్యతలు తీసుకుని విధులు నిర్వహిస్తున్నారు.

కొమ్మాలపాడులో ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడులో శనివారం శ్రీ ఖాదర్ మస్తాన్ అలీషా, ఖాశింసా ఖాదర్ 122వ ఆరాధన మహోత్సవం వైభవంగా శనివారం నిర్వహించారు. మనీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామంలో గంధోత్సవం నిర్వహించారు. ఉరుసు మహోత్సవానికి పలనాడు, గుంటూరు, ప్రకాశం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి ముస్లిం కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో గ్రామంలో పెద్ద ఎత్తున తిరుణాల వాతావరణం నెలకొని ఉంది. గ్రామంలో అన్నదానం నిర్వహించారు.

వైభవంగా తిరునాళ్ల

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని గూడవల్లి పొలాల్లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక తిరుణాల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. బాడవ తిరణాలుగా ప్రసిద్ధి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా శనివారం రాత్రి స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

ఫారం పాండ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

ప్రతి పంచాయితీలో ఫారం పాండ్లు నిర్మించి నీటిని నిల్వ చేసి వర్షాలు లేని సమయంలో రైతులు వాటిని వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఆర్ జనార్ధన్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పశువులకు దాహం తీర్చేందుకు నీటి తొట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మండలంలో ప్రతిరోజు 6వేల మంది కూలీలకు పని కల్పించాలని, రోజు కూలి రూ.290 ఇచ్చే విధంగా చూడాలని చెప్పారు. పని సమయంలో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీలను ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, బీమా యోజన పథకంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ టి వెంకట్రావు, ఇసి శివరామకృష్ణ, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పొలాల్లో వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని బీసీ హాస్టల్ వెనుక మాగాణి పంట పొలంలో మృతదేహం శనివారం లభ్యమైంది. మృతుడు పట్టణంలోని 14 అవార్డుకు చెందిన ఓరుసు నాగరాజు(35)గా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రోన్ కెమెరాతో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వేటపాలెం

డ్రోన్ కెమెరా సహాయంతో మండలంలోని రావూరి రోడ్డు జంక్షన్ నందు వాహనాలను పోలీసులు శనివారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరా సహాయంతో వాహనాలు తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. వాహనదారుల వద్ద సరైన డాక్యుమెంట్స్ లేని వారిని గుర్తించి వాహనాలు పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సి లేని వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొత్త వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలపాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'కిశోర వికాసం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న సిడిపిఒ ఎం సుచిత్ర

ప్రజాశక్తి - రేపల్లె

కిశోర వికాసం పున ప్రారంభం ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగు పర్చడానికి ఓ మంచి కార్యక్రమమని సిడిపిఒ ఎం సుచిత్ర అన్నారు. కిషోర్ వికాసం ప్రత్యేక కార్యక్రమంపై స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. సిడిపిఒ ఎం సుచిత్ర మాట్లాడుతూ మే 2నుంచి జూన్ 10 వరకు 15 నుంచి 18 ఏళ్ల వయసు పిల్లలను సమూహాలుగా ఏర్పాటు చేసి రోజుకు ఒక టీం ప్రకారం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బాలికలకు రక్తహీనత లేకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతినెల జరిగే రుతుక్రమంపై అపోహలు ఉండకూడదని అన్నారు. రక్తహీనత లేకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. బాల్యవివాహాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. 18ఏళ్ల నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని అన్నారు. బాల్యవివాహాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమ్మర్ క్యాంపుగా కిషోరి వికాసం రూపొందించినట్లు తెలిపారు. సూపర్వైజర్లు నాంచారమ్మ, రజిని, వెంకటరత్నం, శివజ్యోతి, సునీత, మంజుల పాల్గొన్నారు.

కారంచేడు : కిషోర్ వికాసం ప్రత్యేక కార్యక్రమంపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె నేతాజీ, ఎపిఎం మోహనరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ హిమబిందు, సునీత మాట్లాడుతూ కిషోర్ వికాసం ప్రత్యేక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చెప్పారు. బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాలికల పోషణ, బాలికల రక్షణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. పాటలు, నృత్యం, నాటకీకరణ రూపంలో చైతన్యం కలిగిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న కారంచేడు ఎంపిడిఒ కె నేతాజి

నిజాంపట్నం : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలకు సక్రమంగా ఇవ్వాలని జిల్లా పీడీ డి రాధా మాధవి చెప్పారు. పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడి కార్యకర్తల ప్రాజెక్ట్ సమావేశం శనివారం నిర్వహించారు. అంగన్‌వాడి కార్యకర్తలు సమయపాలన పాటించాలని చెప్పారు. ప్రీ స్కూల్ సక్రమంగా నిర్వహించాలని, బరువు తక్కువ పిల్లలు పట్ల శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమములో సిడిపిఒ ఎం అనసూయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పిడి డి రాధామాధవి

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం రవాణా సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన జాతీయ రహదారిని ఆసరాగా తీసుకొని పంట పొలాల్లో సైతం అక్రమ లేఔట్లు వేసి స్థిరాస్థి వ్యాపారంగా మారుస్తున్నారు. ఒంగోలు, త్రోవగుంట నుండి కత్తిపూడి వరకు ఏర్పడిన 216 జాతీయ రహదారి నిర్మాణంతో భట్టిప్రోలు మండలంలో ఈ రహదారి వెంట సుమారు 10 లేఔట్లకు పైగా రూపు దిద్దుకున్నాయి. అద్దేపల్లి, సూరేపల్లి, ఓలేరు పంచాయతీల పరిధిలో ఎకరాల కొద్దీ పంట భూమిని పూడ్చివేసి ఎలాంటి అనుమతులు లేకుండానే లే అవుట్లు తయారు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఈ లేఔట్లలో స్థలాల కొనుగోళ్లు, అమ్మకాలు యదేచ్ఛగా జరుగుతున్నాయి. గత నెల రోజుల క్రితం వరకు ఈ అక్రమ లేఔట్లకు కనీసం భూ మార్పిడికి సంబంధించిన అనుమతులు కూడా లేక పోవడంతో అప్పటి తహశీల్దారు మేక శ్రీనివాసరావు విఆర్ఒల ద్వారా ఈ లేఔట్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. భూ మార్పిడి చేయకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో హెచ్చరించడంతో లేఔట్ దారులు భూమి మార్పిడికి సంబంధించిన సొమ్ము ప్రభుత్వానికి చెల్లించినట్లు తెలిసింది. అక్రమ లే అవుట్ ఏర్పాటుకు సిఆర్డిఎ లేదా బుడా, పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. కానీ ఏ ఒక్క లేఅటుకు ఎలాంటి అనుమతులు పొందలేవు. కనీసం వాటి కొరకు దరఖాస్తులు చేసుకున్న దాఖలాలు కూడా లేకపోవడం గమనార్హం. గత వైసిపి పాలనలో

భట్టిప్రోలులో ఏర్పాటు చేస్తున్న లే అవుట్

రూపుదిద్దుకున్న ఈ లేఔట్లకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేవని తెలుసుకున్న కూటమి ప్రభుత్వ నాయకులు, ప్రజా ప్రతినిధులు వీటిపై దృష్టి సారించారు. అనుమతులు లేని కారణంగా తక్షణమే లేఔట్లలో ఏర్పాటు చేసిన రహదారుల చిద్రం చేసి స్థలాల చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను కూల్చేందుకు సిద్ధపడ్డారు. కూల్చివేత పనులు ప్రారంభమైన కొద్ది గంటల్లోనే ఆ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. నియోజక వర్గస్థాయి ప్రజాప్రతినిధుల నుండి ఫోన్లు రావడంతో ఎక్కడికి అక్కడే పనులు ఆపేసి వెళ్లారని ప్రచారం.

పలుకుబడి ఉంటే అనుమతులతో పని ఏమిటి ?

లేఔట్ నిర్మాణదారులకు అధికార పార్టీ అండ, సొమ్ము, పలుకుబడి ఉంటే ప్రభుత్వానికి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన పనేముందని పలువురు లేఅవుట్ యజమానులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. వివిధ గ్రామాల పరిధిలోని లేఔట్ యజమానుల మొత్తం వాటాల వారీగా సొమ్మును సేకరించి నాయకులు, ప్రజా ప్రతినిధులకు అప్పగిస్తున్నామని, ఇంకా తమకు అనుమతులతో పని ఏమిటని మనోధైర్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. కంచె చేను మేసిన చందంగా ప్రభుత్వానికి లే అవుట్ల ద్వారా ఆదాయాన్ని సమకూర్చాల్సిన ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించి ప్రభుత్వ ఆదాయానికి గండికోట్టడం ఎంతవరకు సమంజసమని చర్చించుకుంటున్నారు. లేఔట్లలో గృహ నిర్మాణానికి పంచాయతీ అనుమతి లేదా సిఆర్డిఎ, బుడ అనుమతి పొందాల్సి ఉంది. అయితే గృహ నిర్మాణం చేపట్టేవారు బ్యాంకుల నుండి రుణం పొందటానికి మాత్రమే అనుమతులు కావాలి తప్ప ఎలాంటి రుణాలు లేకుండా గృహ నిర్మాణం సొంత సొమ్ముతో చేపట్టుకోవడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదని సాక్షాత్తు లేఔట్ యజమానులే కొనుగోలు దారులకు చెప్పి ఒప్పిస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా విచ్చలవిడిగా పుట్టగొడుగులా వెలుస్తున్న అక్రమ లేఔట్లపై ఉన్నతాధికారులు దృష్టి సారించి కొరడా ఝుళిపించి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని రాబట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దారు మేక శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్మాణదారులు భూమార్పిడికి సంబంధించి అనుమతులు పొందాలని చెప్పారు. మిగతా అనుమతులు ఆయా శాఖల పరిధిలో ఉన్నా యని వివరించారు.

యువకుడిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - రేపల్లె

అక్రమ సంబంధం నెపంతో ఓ యువకుడినిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో యువకుడిపై తీవ్ర గాయాలైన సంఘటన ఘటన పట్టణంలోని 7వ వార్డులో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన దేవరపల్లి స్వరూపరాణి, లక్ష్మణరావు కొడుకు నవీన్ కుమార్ (30) డీఎస్సీకి సిద్ధం అవుతున్నాడని, ఇంటి ప్రక్కన నివాసం ఉండే దేవరకొండ కోటేశ్వరరావు అను అతను తన భార్యతో నవీన్ కుమార్ అక్రమ సంబంధం పెట్టుకున్నడనే అనుమానంతో శనివారం నవీన్ కుమార్‌పై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడని సిఐ ఎ మల్లిఖార్జునరావు తెలిపారు. గమనించిన స్థానికులు దాడికి అడ్డు తగిలి గాయపడ్డ నవీన్ కుమార్‌ను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నవీన్ కుమార్ తల్లి స్వరూప రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముండ్లమూరు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. దర్శి మండలం శామంతపూడికి చెందిన ఎస్‌కె మస్తాన్ వలి (52) శుక్రవారం రాత్రి పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కారుమంచికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శుక్రవారం అర్ధరాత్రి దర్శి రోడ్డులో పోలవరం, వేంపాడు గ్రామాల మధ్య అర్ధరాత్రి మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్ వలి మృతదేహాన్ని 108 వాహనంలో అర్ధంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు ఎస్‌కె మస్తాన్ వలి భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ పివి హనుమంతరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

పచ్చిరొట్ట ఎరువులు వాడుకోవాలి

ప్రజాశక్తి - నగరం

మండలంలోని రైతులు తమ పొలములను లోతుగా దున్నుకోవడం వలన చీడ పీడలు నివారించవచ్చని, మరల వేసుకునే పంటలను వాటి నుండి కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారి వి రమేష్‌బాబు అన్నారు. మట్టి నమూనాలు రైతు సేవ కేంద్రంలో సిబ్బంది సేకరిస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. పొలాల్లో నీటి కుంటలు తవ్వించుకోవడం వలన భూగర్భ జలాలు కాపాడుకోవచ్చని తెలిపారు. రైతు సేవ కేంద్రంలో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. కౌలు దారులు అందరూ పంట సాగు హక్కు పత్రంకు విలేజ్ రెవిన్యూ అధికారిని కలిసి పొందాలని తెలిపారు. పచ్చిరొట్ట పైరులు జీలుగా, జనుము, పిల్లి పెసర సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. 50శాతం రాయితీపై అందించే విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అసరమైన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రజాశక్తి
ఆదివారం 27 ఏప్రిల్ 2025

నూతన కమిటి లేఖలు అందిస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఐఎల్‌టిడి కంపెనీ వద్ద మేడే వేడుకలు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఐఎల్టిడి కంపెనీ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న మేడే వేడుకలు విజయవంతంగా నిర్వహించు కుందామని ఫెడరేషన్ బ్రాంచ్ కార్యదర్శి ఘంటా సుధీర్ అన్నారు. ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్టిడి కంపెనీ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం సమావేశం బ్రాంచ్ కార్యాలయంలో బి పోతురాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మే డే వేడుకలు ఘనంగా నిర్వహించు కోవాలని అన్నారు. గౌరవ అధ్యక్షులు ఎం వసంతరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోయే పరిస్థితిలో ప్రస్తుతం మేడే జరుపుకుంటున్నామని అన్నారు. ఇటీవల విజయవాడలో నూతనంగా ఏర్పడిన ఫెడరేషన్ రాష్ట్ర కమిటి కమిటీ లెటర్‌ను ఫ్యాక్టరీ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, పర్సనల్ మేనేజర్ రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి సుధాకర్, బి పోతురాజు, ట్రెజరర్ పఠాన్ కాలీషా, భాస్కర్, చింత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జామాయిల్ తోట దగ్ధం

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని పోలవరంకు చెందిన అనపర్తి జాన్ ప్రభాకర్‌కు చెందిన రెండకరాల జామాయిల్ తోటను శ క్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. జామాయిల్ తోట పూర్తిగా దగ్ధం కావడంతో రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వారం రోజుల్లో కోతకు వచ్చిన జామాయిల్ తోట దగ్ధం కావడంతో బోరున విలపిస్తున్నారు.

జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని ఇడుపులపాడులో ఊరు బయట పొలాల్లో చిల్ల చెట్ల మధ్య గ్యాంబ్లింగ్ ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ జి సురేష్ చెప్పిన వివరాల మేరకు గ్రామంలో సమాచారం వారిపై సిబ్బందితో కలిసి ఇడుపులపాడు వెళ్లి మఫ్టీలో పట్టుకున్నారు. వారి వద్ద రూ.1850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దాడికి పాల్పడిన రాజేష్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

చావలి గ్రామానికి చెందిన పోతుల కొండయ్యను కొద్ది రోజుల క్రితం కులం పేరుతో దూషించి బహిరంగంగా చెప్పు తో కొట్టిన జనసేన వేమూరు ఇన్‌ఛార్జి ఉసా రాజేష్‌ను అధిష్టానం పార్టీ నుండి శాశ్వతంగా బహిష్కరించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది దోవా రమేష్ రాంజీ డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ఇస్తున్నరుణాలు పాలక పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు బినామీ పేర్లతో దండుకుంటున్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. బినామీకి సహకరించని పోతుల కొండయ్యను చావలి సెంటర్లోకి పిలిచి కులం పేరుతో దూషించి బహిరంగంగా చెప్పుతో కొట్టి దాడికి పాల్పడిన విషయంపై పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ నేటికీ జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ కానీ, రాష్ట్ర అధినాయకత్వం గానీ ఊసా రాజేష్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రా బాబురావు, పి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేమూరు : దళిత యువకునిపై దాడి చేసి కుల దూషణ చేసిన జనసేన ఇన్‌ఛార్జి ఊసా రాజేష్‌కు పార్టీ అధిష్టానం నుండి షోకాస్ నోటీసులు అందాయి. కార్పొరేషన్ రుణాల కోసం బినామీగా ఉండలేదన్న అక్కసుతో చెప్పుతో కొట్టి కుల దూషణ చేసిన ఘటనపై కేసు నమోదు కాగా పార్టీ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందన్న కారణంతో అధిష్టానం నోటీసులు అందజేసింది. 48 గంటల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది.

పోరాట ఫలితమే 8 గంటల పని విధానం

ప్రజాశక్తి - రేపల్లె

లేబర్ కోడులను వ్యతిరేకిస్తూ మే 20న సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. సిఐటియు పట్టణ అధ్యక్ష లు జె ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడే ఘనంగా నిర్వహించాలని అన్నారు. కార్మికుల పోరాట ఫలితంగానే 8గంటల పని విధానం వచ్చిందని అన్నారు. ప్రస్తుతం ఈ విధానానికి తిలోదకాలు ఇచ్చి 10నుండి 14గంటలు పని చేయి స్తున్నారని అన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యం గా ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, ఎల్‌అండ్‌టి సుబ్రహ్మణ్యం వారానికి 90 గంటలు పని చేయాలని, ఆదివారాలు కూడా పనిచేయాలని చెప్పటం అంటే పెట్టుబడిదారుల ధన దాహం ఎలా ఉందో అర్థమవు తోందని అన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు మణిలాల్

ను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, అవి అమల్లో కి వస్తే కార్మికులు బానిసలు అవుతారని అన్నారు. సమ్మె హక్కు ఉండదని అన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యా ప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు మే 20న సమ్మెకు పిలు పు ఇస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గ్లోరీ, యు రామకృష్ణ, ప్రసాద్, డి ప్రభాకరరావు, ఎస్‌కె కాలేషా, కె రాము, వై వాసు, డి శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ వస్త్ర వ్యాపారుల ర్యాలీ

ప్రజాశక్తి - చీరాల

కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వస్త్ర దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు తులాబందుల సురేష్ మాట్లాడుతూ కాశ్మీర్లో జరిగిన ఘటన యావత్ భారత దేశాన్ని కండతడి పెట్టించిందని అన్నారు. ఇలాంటి సమయంలో అందరూ దేశానికి మద్దతుగా నిలబడి ఐక్యత చాటి చెప్పాలని అన్నారు. నిరసన ప్రదర్శన చేపడుతున్న సమయంలో పట్టణ, పరిసర ప్రాంతాల్లోని వస్త్ర వ్యాపార దుకాణాలు స్వచ్ఛందంగా మూసి వేశారు. ర్యాలీ అనంతరం యధావిధిగా దుకాణాలు తెరిచినట్లు తెలిపారు. స్థానిక మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం నుంచి ప్రారంభించిన ర్యాలి పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్ల మీదగా సాగింది. స్థానిక గడియార స్తంభం సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో చీరాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రెటరీ చిన్ని లీలాధర్, చీరాల ఎంజిసి

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న వస్త్ర వ్యాపారులు

మార్కెట్ అధ్యక్షులు చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు, దుకాణాల వస్త్ర వ్యాపారాలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి చిన్ని లీలాధరరావు, ఎంజిసి మార్కెట్ అధ్యక్షుడు వేముల చంద్రశేఖర్, టిటిఏంఎ అధ్యక్షుడు శీరాం వేణుగోపాల్, కార్యదర్శి కోట శ్రీమన్నారాయణ, పెనుగొండ కిషోర్, కాకర్ల శైలేష్, చీమకుర్తి బాలకృష్ణ, బర్నికల నాగేశ్వరరావు, చుండూరి బాలాజీ, నరేంద్ర, కెవి సుబ్బారావు, గుర్రం రాఘవరావు, సంకా రవికుమార్, బివి సుబ్బయ్య, శీరాం చంద్ర, శ్యాం ప్రసాద్, చేబ్రోలు బాబాజీ, శబరి, డాక్టర్ బొలిశెట్టి స్వామి, వేమా జనార్ధన, నారాయణ మూర్తి పాల్గొన్నారు.

రాంనగర్‌లో పోలీసుల కార్డెన్ సెర్చ్

సారా సామాగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - చీరాల

ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చీరాల పోలీసులు శనివారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంనగర్, న్యూ కాలనీ, సాయి కాలని, వివిధ ప్రాంతాల్లో డిఎస్పి మహమ్మద్ మోయిన్ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీ కరణ పత్రాలు లేని 28బైకులు, ఆరు ఆటోలు అనుమా నస్పదంగా గుర్తించి రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ప్రజల ప్రాణాలతో చెలగా టం ఆడుతున్న నాటు సారా తయారి స్థావరాలపై తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సారా తయారీకి ఉపయోగించే ఐదు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మహ్మద్ మోయిన్ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా సంచరించిన, నాటు సారా తయారీకి ఎవరైన పాల్పడిన వారి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ సుబ్బారావు, టూ టౌన్ సిఐ నాగభూషణం, రూరల్ సిఐ శేషగిరిరావు, ఇంకొల్లు సిఐ రమణయ్య, ఎస్ఐలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, నాగ శేను, రఫి, పవన్ కుమార్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పోలీసులు మండలంలోని వెల్లటూరు ఎస్టీ కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ శుక్రవారం రాత్రి నిర్వహించారు. రేపల్లె డిఎస్పీ ఆవుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 80 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఇంటింటినీ జల్లెడపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. వేమూరు, చుండూరు, రేపల్లె టౌన్, రూరల్ సిఐలు, భట్టిప్రోలు, చుండూరు, నిజాంపట్నం, చోడాయపాలెం ఎస్ఐలు, సబ్ డివిజన్ పరిధిలోని 72మంది పోలీస్ సిబ్బంది కాలనీలో తనిఖీలు చేశారు. సరైన ధ్రువపత్రా లు లేని 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసే ఉద్దేశంతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరాలు నియంత్రించేందుకు, ఆసాంఘిక కార్యకలు కట్టడి చేసేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు పరిసరాల్లో నివాసం ఉంటున్నా, అనుమానాస్పదంగా సంచరిస్తున్న తమకు సమాచారం ఇవ్వాలని, లేదా 112, 100 నంబర్లకు కాల్ చేసి తెలపాలని అన్నారు.

కార్డెన్ అండ్ చర్చి లో పాల్గొన్న పోలీసులు

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - బాపట్ల

శాంతి భద్రతల నేపథ్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, పాత బస్టాండ్, చీలు రోడ్ సెంటర్, లాడ్జిలు, హోటల్స్, రెస్టారెంట్లలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏకకా లంలో జరిగిన ఆకస్మిక తనిఖీల్లో పట్టణ సీఐ రాంబాబు, ఎస్ఐలు విజయ్ కుమార్, చంద్రావతి పాల్గొన్నారు.

ఇంకొల్లు : స్థానిక బస్టాండ్, సినిమా హాల్ సెంటర్, పర్చూరు రోడ్లో ప్రత్యేక వాహన తనిఖీలు సీఐ రమణయ్య, ఎస: జి సురేష్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు.

అవార్డు అందుకున్న కవులను సన్మానిస్తున్న దృశ్యం

కవులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

శ్రీ కాళికాసమేత కఠేశ్వర స్వామివారి ఆలయంలో గాడేపల్లి దివాకర దత్ అధ్యక్షతన సృజన సాహిత్య సమావేశం శనివారం నిర్వహించారు. చప్పిడి వీరయ్య ప్రారంభించారు. టెర్రరిస్టుల తూటాలకు బలైన యాత్రికులకు నివాళి ప్రకటించారు. ఇటీవల మృతి చెందిన సాహిత్యవేత్తలు లక్ష్మణమూర్తి, ముంగర జాషువాకు నివాళి అర్పించారు. ఉగాది పురస్కారాలు అందుకున్న తేళ్ళ అరుణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వడలి రాధాకృష్ణ, డాక్టర్ నూనె అంకమ్మరావును దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. వారణాశి రఘురామశర్మ, పాలపర్తి జ్యోతిష్మతి, కె అనిలకుమారసూరి, లక్కరాజు శ్రీనివాసరా వులు ఉగాది పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు. వీరవల్లి సుబ్బారావు, డాక్టర్ యు దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, మారం కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, పసుమర్తి కోటయ్య, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, డివిఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మురుగు కాలవలో లీక్ అవుతున్న త్రాగునీటి పైపులు

మురుగు కాల్వలో పగిలిన తాగునీటి పైపులు

ప్రజాశక్తి - చీరాల

పట్టణానికి త్రాగునీరు అందించే పైపు లైను డ్రైనేజీ కాలవలో లీక్ అవ్వడంతో త్రాగునీరు కలుషితం అవుతుంది న లారీ బిల్డింగ్స్ సమీపంలోని బ్రిడ్జి వద్ద మురుగు కాలువలో తాగునీటి పైపులు పగిలిపోయాయి. మంచినీటి చెరువు నుండి శుద్ధి చేసిన నీళ్లు ఆ పైపులైన్లతో సరఫరా జరుగుతుంది. గత కొద్ది రోజులుగా పైపులు పగిలే ఉన్నాయ ని పశువుల కాపరులు చెబుతున్నారు. ఉదయం నీటి సరఫరా అనంతరం మురుగనీరు అంతా ఆ పైపులోకి చేరి తిరిగి త్రాగు నీటిలో కలిసిపోతుందని అన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు పైపులైలను మరమ్మతులు చేసి శుద్ధి చేసిన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పశువైద్యుల సేవలు అభినందనీయం

- జూనోటిక్ వ్యాధుల నివారణలో ప్రధాన పాత్ర
- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఘనంగా ప్రపంచ పశు వైద్య దినోత్సవ వేడుకలు

ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జేడీ బేబీరాణి, కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మూగజీవాల పాలిట ప్రాణదాతలుగా పశు వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా తెలిపారు. ఒంగోలు ఎన్జీఆర్ కళాక్షేత్రంలో శనివారం జరిగిన ప్రపంచ పశువైద్య దినోత్సవ వేడుకలలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పహల్గాంలో ఈ నెల 22న ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. అనంతరం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంపిన సందేశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పవిత్రమైన వైద్య వత్తిలో ఉండి మూగ జీవాలకు వైద్య సేవలు అందిస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బందికి ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని తెలుపుతున్నట్లు తెలిపారు. మానవాళికి ప్రత్యక్షంగానే ఉపయోగపడే మూగజీవాలకు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ఏటా ఏప్రిల్ నెల చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా జరుపు కుంటున్నామన్నారు. పశువులకు వైద్య సేవలతో పాటు పశువుల నుంచి సోకే జూనోటిక్ వ్యాధుల నివారణలో పశు వైద్యులు ప్రధానపాత్ర పోషిస్తున్నారన్నారు. ఎక్కువ శాతం పేద కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పాడి పరిశ్రమలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పశు సంవర్ధక శాఖ సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.లక్ష్మీప్రసన్న, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీరాణి, పశు సంవర్ధక శాఖకు సంబంధించి వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువల మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జలవనరుల కింద పంట కాల్వల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. డిఆర్‌సిలో ప్రజా ప్రతినిధులు చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. గుంటూరు ఛానల్, నల్లమడ కాల్వల అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని రైతుల శ్రేయస్సు కోసం ప్రజా ప్రతినిధులు చర్చించిన అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలో మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గుంటూరు ఛానల్ విస్తరణకు నాలుగు ఎకరాల స్థలం భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే రూ.15 కోట్ల నిధులు మంజూరు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపిన విషయాలపై సమీక్షించారు. మైనర్ కాల్వలపై 119 మరమ్మతు పనులకు రూ.10.68 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం అవన్నీ టెండర్ దశలో ఉన్నాయన్నారు. పంట కాల్వల మరమ్మతు పనులు, పూడికతీత పనులు చేయడానికి ప్రభుత్వం 454 పనులు గుర్తించిందన్నారు. యుద్ధప్రాతిపదిక వాటిని చేపట్టేందుకు రూ.12.59 కోట్లు నిధులు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. వరద ప్రభావంతో దెబ్బతిన్న పంట కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేయడానికి 148 పనులు గుర్తించామన్నారు. రూ.7.75 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో పంట కాల్వలు నీరు లేనందున మరమ్మతు పనులు వేగంగా ప్రారంభించాలన్నారు. అనంతరం వివిధ శాఖల్లో జరుగుతున్న పనులపై ప్రజా ప్రతినిధులు చర్చించిన అంశాలు, అధికారులు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. సమావేశంలో సిపిఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టర్ వెంకట మురళి

ఎత్తిపోతల పథకాల నిర్మాణంపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కొమ్ముమూరు కాలువ ఆయకట్టులో ఉన్న చివరి భూములకు సాగు నీరందించాలన్న ఉద్దేశంతో ప్రధాన కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మాణం వల్ల నల్లమడ లాకుల దిగువనున్న మాగాణి భూములకు సాగునీరందే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రప్రభుత్వం నూతనంగా చేపట్టిన పి4 కార్యక్రమంలో భాగంగా పత్తిపాడు నియోజకవర్గం కాకుమానుకు చెందిన ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ బాబు రూ.10 కోట్ల అంచనాలతో కొమ్ముమూరు ప్రధాన కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం ముందుకు వచ్చారు. క్రిష్ణా పశ్చిమ డెల్టా కొమ్ముమూరు కాలువ 58వ కిలోమీటరు పాండ్రపాడు వద్ద అప్పాపురం మెయిన్ ఛానల్‌లో ఎత్తిపోతల పథకం నిర్మించనున్నారు. దీని ద్వారా కాకుమాను మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన 5,315 ఎకరాలకు సాగునీరు అందించచ్చునని చెబుతున్నారు. ఇందుకోసం అక్కడ 10 కిలోమీటర్ల మేర కాలువను కూడా తవ్వనున్నారు. గుంటూరు జిల్లా పరిధిలో కొమ్ముమూరు ప్రధాన కాలువపై చేపట్టనున్న ఎత్తిపోతల కారణంగా బాపట్ల జిల్లా పరిధిలోని నల్లమడ లాకుల దిగువ నున్న కొమ్ముమూరు ఆయకట్టు గ్రామాలైన కుంకలమర్రు,కారంచేడు, స్వర్ణ నుంచి పెదగంజాం వరకు ఉన్న మాగాణి భూములను రానున్న కాలంలో సాగునీరు అందే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు. కొమ్ముమూరు కాలువ దశాబ్దాల కాలంగా మరమ్మత్తులకు నోచుకోలేదు. తుపానులు, భారీ వర్షాల సమయంలో సాగర్ ఆయకట్టు లోని మురుగునీరు, ఎగువ ప్రాంతంలోని వరదనీరు అంతా సముద్రంలోకి చేరే సమయంలో రొంపేరు, నల్లమడ డ్రైన్లు పొంగి కొమ్ముమూరు కాలువకు భారీగా గండ్లు పడుతూ వచ్చాయి. అరకొర మరమ్మత్తులు చేస్తూ వచ్చారు. దశాబ్ద కాలంగా కాలువ కట్టలు బలహీనంగా ఉన్నాయి. ఈ కారణంగా కొమ్ముమూరు కాలువకు గరిష్ట ప్రవాహ సామర్థ్యం మేరకు సాగునీటి విడుదల చాలా కాలంగా జరగడం లేదు. కొమ్ముమూరుకు అరకొరగా నీటి విడుదల జరుగుతున్న క్రమంలో జిల్లా పరిధిలోని మాగాణి భూములను సక్రమంగా నీరందే పరిస్థితి ఉండడం లేదు. అనేక సంవత్సరాలుగా జిల్లా పరిధి లోని రైతులు నల్లమడ లాకుల నుంచి పెదగంజాం వరకు కాలువపై ఆయిల్ ఇంజన్లు పెట్టుకుని తమ పొలాలకు సాగునీరు ఎత్తిపోసుకుంటున్న పరిస్థితి ఉంది.ఇందుకోసం రైతులపై సాగునీటి కోసం ఎకరాలకు రూ.5 వేల వరకు అదనపు భారం పడుతుంది.ఈ నేపథ్యంలో విజయవాడ కృష్ణా కెనాల్ నుంచి పెదగంజాం వరకు ఉన్న కొమ్ముమూరు ప్రధాన కాలువ పూడికలు తీసి కాలువ కట్టలను పటిష్టపరచాల్సి ఉంది.ఇలా చేయడం ద్వారా కాలువ ఆయకట్టు పరిధిలో ఉన్న అన్ని మాగాణి భూములకు పుష్కలంగా సాగు నీరు లభిస్తుంది. ఇందుకోసం కూటమి ప్రభుత్వం నిధులను విడుదల చేయాల్సి ఉంది. అదేమి లేకుండా పి4 పేరుతో కొమ్ముమూరు కాలువ ఎగువన భారీ వ్యయంతో చేపట్టే ఎత్తిపోతల పథకం వల్ల దిగువకు రావలసిన సాగునీరు అప్పాపురం మెయిన్ ఛానల్ వద్ద దారి మళ్లతాయి. దీంతో బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న కాలువ చివరి భూములకు ఇప్పుడు వస్తున్న అరకొర సాగునీరు కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు పర్చూరు నియోజకవర్గ పరిధిలో కూడా కొన్ని ఎత్తిపోతల పథకాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కొమ్ముమూరు కాలువను అభివృద్ధి చేసి సమృద్ధిగా సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలా చేయకుండా ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టవద్దంటున్నారు.

సాగునీరందే పరిస్థితి ఉండదని ఆవేదన

కొమ్ముమూరు కాలువ

మళ్లీ నేర సంస్కృతి

టిడిపి నేత వీరయ్యచౌదరి హత్య పాలకపక్షంలోనే కాకుండా ప్రజానీకంలోనూ చర్చగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ తరహా హత్య ఆందోళన కూడా కలిగిస్తోంది. ఎప్పుడో అంతరించిపోయిన ఆధిపత్య గొడవల నేపథ్య హత్యలు మళ్లీ తెరపైకి వచ్చాయనే కలవరం కూడా పట్టణ ప్రజానీకంలో కలుగుతోంది. ఎప్పుడో పాతికేళ్లకు ముందు ఒంగోలులో రాత్రి 7 గంటల ప్రాంతంలో కరెంటు పోయిందంటే ఎవరో ఒకరు హత్యకు గురవుతారనే చర్చ జరిగేది. అందుకు తగ్గట్టుగానే హత్యలు జరిగాయి. అనేక మంది నేరస్తులు ఒకరినొకరు పొడుచుకుని చచ్చారు. ఆ తర్వాత కిషోర్‌కుమార్ ఎస్పీగా వచ్చాక నేరస్తులకు ముచ్చెమటలు పట్టించారు. ఎన్‌కౌంటర్లలో ఎందరినో భూమి మీద నుంచి పంపించారు. కొందరు భయంతో పారిపోయారు. 2000 సంవత్సరం తర్వాత మళ్లీ ఈ తరహా ఆధిపత్య రాజకీయ వ్యాపార సంబంధాల విభేదాలతో హత్యలు లేవు. 2012 ప్రాంతంలో ప్రజారాజ్యం యువనేత వెల్లంపల్లి గోపి హత్య కూడా ఆందోళన కలిగించింది. అయితే పరంపరగా కొనసాగలేదు. ఇపుడు వీరయ్య చౌదరి హత్య ఆందోళన కలిగించింది. సిఎం చంద్రబాబు కూడా రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ నేరాలకు ప్రభుత్వం అవలంబిస్తోన్న కొన్ని పద్ధతులే కారణంగా చూపక తప్పదు. రేషన్, ఇసుక, మద్యం రంగాలు.. పార్టీ నేతలకు ఆదాయాలుగా మారాయి. వాటిపైనే నేతలెవరు అధికారంలో ఉంటే వాళ్లు కన్నేస్తారు. ఇందులోనూ ఆధిపత్యం. అంతా తమకే కావాలనే తపన. ఇదే నేతలు కొందరి ప్రాణాలపైకి తెస్తోంది. మద్యం, రేషన్ మాఫియాలో తనకు ఎదురులేకుండా ఉండాలనే భావనతో వీరయ్యచౌదరి అందరినీ ఇబ్బంది పెట్టాడని చెబుతుంటారు. నియోజకవర్గంలో మద్యం అంతా తన చెప్పుచేతుల్లో ఉంది. ప్రత్యర్థులుగా ఉన్నవారిని ఆర్థికంగానూ ఇబ్బందిపడేలా చేస్తారు. ఇప్పుడు ఇదే జరిగింది. పెత్తనం పెరిగాక విభేదాలు తీవ్రమవుతాయి. అవి చివరికి హత్యల వరకూ దారితీస్తాయి. వీరయ్య చౌదరి విషయంలో ప్రత్యర్థులను పెట్టిన ఇబ్బందులే ఇందుకు కారణంగా విశ్లేషిస్తున్నారు. కసిగా 53 పోట్లు పొడిచారంటే సూత్రధారులే కాకుండా పాత్రధారులూ వీరయ్య బాధితులుగా ఉన్నారా? అనే చర్చ సాగుతోంది. ఏదేమైనా నిందితులు ఎవరనేది తేలింది. ఇది పోలీసులకు పెద్ద విషయం కాదు. అయితే హత్య జరగడానికి ప్రేరేపించిన అంశాలపైనే ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలి. ఆదాయం కోసం సృష్టించుకున్న వ్యాపారమాఫియా సామ్రాజ్యాలే చివరికి వారి ప్రాణాలకే ముప్పుగా మారాయి. ఈ తరహా వ్యవహారాలు ప్రమాదకరం. మరో కోణం పోలీసులకూ భవిష్యత్ సవాలుగానే ఉండనుంది. ఎందుకంటే ఇలాంటి హత్యలు ప్రజల్లోనూ భయభ్రాంతులకు గురిచేస్తాయి. కిరాయి హత్యలను ప్రోత్సహిస్తుంటాయి. వీటిని వెంటనే అంటే ఆదిలోనే తుంచేయాలి. గతంలో సంఘటనలు, అనుభవాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. పాత నేరసంస్కృతి మళ్లీ తెరపైకి వచ్చింది. దీని మూలాలపై దృష్టి పెట్టాలి. హోంమంత్రి కూడా వచ్చినందున హత్యకు కారణాలను, ప్రేరేపించిన అంశాలపై ఎక్కువగా దృష్టి సారించాలి. పోలీసులకూ ఇదే కీలక ఎజండాగా మారాల్సిన అవసరం ఉంది.

పొగాకు మార్కెట్‌లో సంక్షోభ ఛాయలు అలుముకుంటున్నాయి. కొనుగోళ్లలో మాద్యం కొనసాగుతోంది. నెలరోజులు దాటినా వేలంలో సీలింగు ధరలు కొనసాగుతున్నాయి. కిలో ప్రారంభ ధర రూ.280 ఇచ్చారు. ఇప్పటికీ ఇదే నడుస్తోంది. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి కేంద్రాన్ని సందర్శించారు. కనీసం మంత్రి వస్తున్న రోజు కూడా వేలంలో ధరను పెంచలేదు. వ్యాపారుల సంఖ్య కూడా చాలా స్వల్పంగానే ఉంది. మరో వైపు ధరలు ఇవ్వకపోగా తెచ్చిన బేళ్లను తిరస్కరిస్తున్నారు. 40 శాతం బేళ్లను వివిధ కారణాలు చెప్పి వెనక్కి పంపుతున్నారు. రైతులు నాలుగు నెలలుగా అష్టకష్టాలు పడి పొగాకు పండించారు. బేళ్ల కట్టి వేలం కేంద్రానికి తీసుకొస్తే వెనుక్కు పంపడం అంటే ఎంత ఇబ్బందో ఆలోచించడం లేదు. వెనుక్కు పంపడం పెంచారు. ధర పెంచమని డిమాండు కన్నా ఇప్పుడు నోబిడ్‌లపైనే అడుగుతున్నారు. అంటే వ్యాపారుల ఎత్తు ఇదే. వారిని డైవర్ట్ చేయడానికి ఇదొక వ్యూహం. రైతులను కారుచౌకగా దోచుకోవడమే మార్గంగా పెట్టుకున్నారు. వేలంలో పోటీని పెంచాలి. అందుకు సమాఖ్య రంగంలోకి దిగాలి. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. కేంద్రం కూడా గతంలో మాదిరిగా పొగాకు బోర్డును రంగంలోకి దించి కొనుగోలు చేయిస్తే వేలంలో మళ్లీ పోటీ పెరిగే అవకాశం ఉంది.

డిఆర్‌సీ వాయిదా పడింది. కీలక సమస్యలు చర్చకు రాకుండా పోయాయి. మళ్లీ ఎప్పుడనేదీ ఇన్‌ఛార్జి మంత్రి ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం డిఆర్‌సీ ఎంతో ప్రాధాన్యతగా భావించారు. గత డిఆర్‌సీలో జరిగిన చర్చ..సభ్యులు అభిప్రాయాలు, డిమాండ్లు గానీ తీర్మానాలు గానీ ఏ మేరకు అమలు జరిగాయన్నదీ చూడాలి. గత సమావేశంలో వెలుగొండ ప్రాజెక్టు, జిల్లా డెయిరీ పునరుద్ధరణ, చదలవాడ పశుక్షేత్రం, మార్కాపురం జిల్లా, ఒంగోలు జిల్లాలో కందుకూరు విలీనం వంటి అంశాలు వచ్చాయి. నియోజకవర్గాల్లో భూసమస్యలు, తాగునీరు, ఇరిగేషన్ సమస్యలూ చర్చకు వచ్చాయి. వాటిపై ఏ మేరకు నిర్ణయాలు జరిగాయో చూశాం. ఏ ఒక్కటీ ముందుకు సాగలేదు. నిధుల్లేవు. నిర్ణయాలూ లేవు. అన్నీ పెండింగులోనే ఉన్నాయి. ఇప్పుడు తెరపైకి సీజనల్ సమస్యలూ వచ్చాయి. తాగునీటి ఎద్దడి పెరిగింది. ఉపాధి హామీ పనులు వేగం కావాలి. గతంలో అక్రమాలు, వేతనాల చెల్లింపులు వంటి వాటిపై విచారణలు జరిగాయి. కొత్తగా పిన్షన్లు, రేషన్‌కార్డులు, ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులకే అవకాశం ఇవ్వలేదు. చాలా మంది పేదలు వీటి కోసం ఎదురుచూస్తున్నారు. కనీ సం డిఆర్‌సీలోనైనా ఎవరైనా సభ్యుడు వీటిపై అడుగుతారనే ఆశతో ఉన్నాయి. ఇంకా ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు అలాగే పెండింగులో ఉన్నాయి. వీటిపై తక్షణం చర్చ అవసరం. అందుకు వీలైనంత త్వరగా డిఆర్‌సీ పెట్టాలనే చర్చ సాగుతోంది.